
సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 29 । జనవరి । 2023



హిందూ వివాహాల నమోదు..

హిందూ వివాహాల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ జరుగుతోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. - 8లో



ఊరికి ఉపకారి

కిడిమి గ్రామంలో ఓ వ్యక్తి తన భూమిని అమ్మి శివాలయం నిర్మిస్తున్నారు. 25 సెంట్లు విరాళంగా కూడా ఇచ్చారు. - 8లో

30న జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళా జరగనుందని ఆ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో జెనెక్స్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సౌజన్యంతో ఈ జాబ్‌మేళా జరుగుతుందన్నారు. వివరాలకు 9703218888 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 7 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఫిబ్రవరి 7 నుంచి 20వ తేదీ వరకు డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీ పరీక్షల నిర్వహణ కేంద్రంలో శనివారం వివరాలు వెల్లడించారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్సిటీ అఫిలియేషన్ పరిధిలో 64 పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రెగ్యులర్‌గా 8125 మంది, సప్లిమెంటరీగా 7950 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు.

వాసుదేవుని సన్నిధిలో రథసప్తమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో వాసుదేవుడు

మందస: శ్రీవాసుదేవ పెరుమాళుని సన్నిధిలో శనివారం రథసప్తమి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు గోపీనంబాళ్ల దాసు కూర్మాచార్యులు ఆధ్వర్యంలో వాసుదేవునికి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం ఆలయంలో ఆదిత్య హృదయం సామూహిక పారాయణం జరిగింది. అనంతరం కూర్మాచార్యులు అరుణ పారాయణం చేశారు.

శ్రీముఖలింగంలో ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో రథ సప్తమి సందర్భంగా శనివారం సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించి అర్చనలు, అభిషేకాలు అనంతరం హారతులిచ్చారు.

'జగనన్న గోరుముద్ద' అమలు పరిశీలన



పాఠశాలలోని ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్

టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ మధ్యాహ్నం భోజనం బాగోలేదని ఫిర్యాదులు రావడంతో ఆయన తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం వండాలని సూచించారు. అనంతరం నాడు–నేడు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభాకరా ప్రణమామ్యహం



దివ్య తేజోమయ దర్శనం



- అరసవల్లిలో వైభవంగా రథసప్తమి వేడుక



సాక్షాత్తు దేవేంద్రుడు ప్రతిష్టించిన శిల్పం.. యావత్ దేవతలు కొలిచిన రూపం.. సమస్త లోకాలకు వెలుగులిచ్చే తేజోమయ స్వరూపం.. అరసవల్లి ఆదిత్యుడు. రథ సప్తమి నాడు అలంకరణల అడ్డు లేకుండా స్వామిని తిలకించి భక్తకోటి పులకించిపోయింది. క్షీరధారల నడుమ 'పాల' భానుడిని చూసి మురిసిపోయిన వారు కొందరైతే.. అపురూప అరుణ శిలను దర్శించి మైమరచిపోయిన వారు ఇంకొందరు. పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండి, చిక్కుడుకాయలతో రథాలు నిర్మించి స్వామికి పుట్టిన రోజు కానుకగా అందించిన వారు మరికొందరు. పవిత్ర మాఘ శుద్ధ సప్తమి ఘడియల్లో అరసవల్లిలో సూర్యభగవానుడి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు తన్మయత్వం చెందారు.



క్యూలో భక్తులు

అరసవల్లి, శ్రీకాకుళం/రూరల్/అర్బన్/క్రైమ్, న్యూకాలనీ/ పీఎన్‌కాలనీ/పాతబస్టాండ్/కల్చరల్ :

ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడి జయంతిని అరసవల్లి వేడుకగా జరుపుకుంది. రథసప్తమి సందర్భంగా అరసవల్లి ఆదిత్య క్షేత్రంలో శుక్రవారం అర్ధరాత్రి 12.15 గంటల నుంచి ప్రారంభమైన క్షీరాభిషేక సేవ శనివారం ఉదయం 7 గంటల వరకు జరిగింది. అనంతరం నిజరూప దర్శనాన్ని సాయంత్రం వరకు కొనసాగించారు. రాత్రి కూడా భక్తులు భారీగా వచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా భక్తులు శనివారం వేకువజాము దర్శనానికి తరలివచ్చారు.

ఏర్పాట్లు భేష్..

గత ఏడాది కంటే ఈ ఏడాది సప్తమి ఉత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించాలన్న తలంపుతో దేవదాయ శాఖాధికారి వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో గతంలో లోపాలుగా కనిపించిన పలు క్యూలైన్ల మార్గాలను మార్చేశారు. దీంతో భక్తులకు పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. అయితే ఈసారి వీఐపీలకు కూడా రూ.500తో టిక్కెట్లు ప్రవేశపెట్టడంతో వారిని సాధారణ దర్శనాల వలె కలిపేశారంటూ భక్తులు అసహనం వ్యక్తం చేశారు. సాధారణ/ఉచిత దర్శనాల క్యూలైన్లో ఉన్న భక్తుల కోసం వేడి పాలు, మంచినీరు, మజ్జిగలను, చిన్నారులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. ఉచిత ప్రసాదాన్ని కూడా అందజేశారు. అయితే నిర్వహణలో కొన్ని శాఖల తీరుతో భక్తులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

వీఐపీ క్యూలైన్లో అంతా అడ్డమే..

వాస్తవానికి క్యూలైన్లు, ఇతరత్రా సౌకర్యాల పరంగా ఏర్పాట్లు బాగున్నప్పటికీ.. ఓవరాల్‌గా చూస్తే మరో సారి పోలీసులు తమ కుటుంబాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లుగా విమర్శలు వెల్లువెత్తాయి. పోలీసులతో పాటు పలు శాఖల అధికారులు తమ కుటుంబ సభ్యులను అడ్డంగా వీఐపీ క్యూలైన్లోకి పంపించేయడంతో సమస్యలు తలెత్తాయి. దీంతో రూ.500 వీఐపీ టిక్కెట్లు దర్శనాలకు రెండున్నర గంటల పైగానే పట్టింది..అలాగే ఉచిత దర్శనానికి నాలుగు గంటలు, డోనర్ పాసులకు గరిష్టంగా 40 నిమిషాల్లో దర్శనాలు జరిగాయి. అభిషేక సేవ, విశిష్ట సేవలకు మాత్రం గంటన్నర సమయం పట్టింది.

భక్తిశ్రద్ధలతో భోగనివేదనలు

సప్తమి ఘడియల్లో సూర్యోదయాన మహిళలు పిడకల పొయ్యిలపై క్షీరాన్నం వండిపెట్టే పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సప్తమి బ్రహ్మ ముహూర్తంలో రథసప్తమి వ్రతం చేశారు. శనివారం ఉదయం 6.15 గంటలకు సూర్యోదయ సమయంలో సూర్యునికి ఎదురుగా ఆవు పిడకల పొయ్యిపై ఆవుపాలు, కొత్త బియ్యం, కొత్త బెల్లంతో క్షీరాన్నం వండి, తర్వాత చిక్కుడు కాయలతో రథం తయారుచేసి, ఆదిత్యుని చిత్రపటం పెట్టి, స్వామికి క్షీరాన్నం నివేదించారు. దీంతో పుష్కరిణి పరిసరాల్లో పిడకల పొగతో, పాల పొంగు వాసనలతో నిండిపోయింది. ఇక్కడ జంగమయ్యల సందడి బాగా కనిపించింది. పుష్కరిణి వద్దకు వెళ్లే మార్గం కూడా పోలీసులతో నిండిపోవడంతో ఇక్కడ భక్తులు స్నానాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు.

ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణ..

దర్శనాల క్యూలైన్లు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ రంగంలోకి దిగి పోలీసుల వ్యవహార శైలిపై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీనిపై ఆగ్రహించిన ఎస్పీ జీఆర్ రాధిక తన కుటుంబంతో ఆదిత్యుని దర్శనం చేసుకున్న అనంతరం ప్రధాన అనివెట్టి మండప గేటు వద్దనే సుమారు గంట సమయం నిలబడి పరిస్థితులను గమనించారు. గేటు వద్ద ఆమె ఉన్నంత వరకు దర్శనాలు సజావుగా జరిగిపోయాయి. ఆమె వెళ్లిపోయాక సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.



క్యూను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక



పోలీసు, ఆలయ అధికారుల కుటుంబాలను లోపలకు పంపిస్తున్న దృశ్యం



రూ.500 వెచ్చించి కొన్న టికెట్లకు న్యాయం ఇదేనా.. అంటూ పోలీసులతో భక్తుల వాగ్వాదం



పుష్కరిణి వద్ద పూజలు చేస్తున్న మహిళ

నిజరూప దర్శనంతో పులకరించిపోయాను

- ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

అరసవల్లి: తొలిసారిగా ఆదిత్యుని నిజరూపాన్ని చూసి పులకరించిపోయానని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆయన శనివారం కుటుంబసమేతంగా అరసవల్లిలో జరిగిన రథసప్తమి వేడుకలకు హాజరై స్వామిని దర్శించుకున్నారు. వైఎస్ జగన్ పాలన మరిన్ని కాలాల పాటు కొనసాగాలని, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. విడతల వారీగా ఇక్కడ మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.రాష్ట్రంలో దేవాలయాల ఆస్తుల ఆక్రమణలపై ప్రభుత్వం చట్ట సవరణలకు సిద్ధమవుతోందన్నారు. ఇటీవలే రూ.800 కోట్ల మేర ఆలయ ఆస్తులను పరిరక్షించామని ప్రకటించారు. ఇలాగే చట్ట సవరణలో లొసుగులు గుర్తించి మార్పులు తీసుకువస్తామన్నారు. రథసప్తమి నాడు ఏర్పాట్లు బాగున్నాయని తెలిపారు.

భక్తుల సేవలో..



వీల్‌చైర్ సాయంతో భక్తుడిని దర్శనానికి పంపిస్తున్న పోలీసులు



భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్న సూర శ్రీనివాసరావు







స్వామి సన్నిధిలో మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



స్వామి చిత్రపటాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ఫర్ హోం, డీజీ విజయ్ కుమార్‌కు అందిస్తున్న దృశ్యం



రెండు రాష్ట్రాల ఎన్‌వైకే డైరెక్టర్ విజయారావు



విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణకు స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తూ..



ఆలయంలో ఎస్పీ రాధిక దంపతులు



విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు, బార్ అధ్యక్షుడు ఫల్గుణరావు

'ధాన్యం కొనుగోళ్లపై ఆందోళన వద్దు'



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పౌరసరఫరాల డీఎం జయంతి

కంచిలి: ధాన్యం కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పి. జయంతితో కలిసి శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరాటంకంగా సాగుతుందని తెలిపారు. రైతులు వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించి, కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 4 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ పి.జయంతి మాట్లాడుతూ ఇప్పటికే రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యం నిల్వల గురించి తమకు సమాచారం అందిందని, ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపామని, అతి త్వరలో మిగిలిన ధాన్యం అంతటినీ కొనుగోలు చేస్తామన్నారు. సమావేశంలో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, తహసీల్దార్ ఎస్. హైమావతి, ఎంపీడీఓ చల్లా శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ పాల్గొన్నారు.

కాలువ కళకళ



వంశధార కాలువలో సాగునీటి ప్రవాహం

ఎల్.ఎన్.పేట: నిండా సాగునీటితో వంశధార కుడి ప్రధాన కాలువ కళకళాడుతోంది. రబీలో వాణిజ్య పంటలు, వరి సాగు చేస్తున్న రైతులకు సాగునీటి అవసరాల కోసం నీటిని విడిచి పెట్టినట్లు వంశధార ఏఈ టి.శ్రీనివాసరావు తెలిపారు. వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా సుమారు 600 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టామన్నారు. కాలువ దిగువన ఉన్న సాగునీటి చెరువులను నీటితో నింపుకోవాలని రైతులకు సూచించారు. వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార మండలాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

వైభవంగా పందిరిరాట



పందిరి రాట వేస్తున్న దృశ్యం

గార: శాలిహుండం కొండపై కాళీయ మర్ధన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శనివారం ఉదయం పందిరి రాట నిర్వహించారు. మాఘపౌర్ణమి నాడు కొండపై కల్యాణోత్సవం జరిపిస్తారు. ఆలయ ట్రస్టీ సుగ్గు మధు రెడ్డి దంపతులు, అర్చకులు మహేంద్రాడ వేణుగోపాలశర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ డ్రాయింగ్ ఎగ్జామినేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జేఈఈ మెయిన్స్ డ్రాయింగ్ ఎగ్జామినేషన్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఒకే ఆన్‌లైన్ సెంటర్‌లో ఒకే షిఫ్టులో ఈ పరీక్ష లు జరిగాయి. 92 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 77 మంది హాజరయ్యారు. సెలవు రోజుల్లో మినహా జేఈఈ పరీక్షలు ఫిబ్రవరి 1 వరకు కొనసాగనున్నాయి.

వందేభారత్ రైలు రూపకర్తతో భేటీ

టెక్కలి: వందేభారత్ రైలు రూపకర్త, ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విశ్రాంత జనరల్ మేనేజర్ సుధాన్షుమణితో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం ఆన్‌లైన్‌లో భేటీ అయ్యారు. ఇంజినీరింగ్ కెరియర్ ఇన్నోవేషన్ ఫర్ ఆత్మనిర్భర్ భారత్ అనే అంశంపై కళాశాలకు చెందిన కెరీర్ గైడెన్స్, మెకానికల్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులంతా సుధాన్షుమణితో ఆన్‌లైన్‌లో చర్చించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. రైలు రూపకల్పనలో చేపట్టిన అంశాలను తెలియజేశారని పేర్కొన్నారు.

నేడు సాఫ్ట్‌టెన్నిస్ జట్టు ఎంపిక

పాతపట్నం: జిల్లా సాఫ్ట్ టెన్నిస్ జిల్లా సీనియర్ జట్టు ఎంపికలు ఆదివారం నిర్వహించనున్నట్లు సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి.అప్పన్న, జె.షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం మండలం కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని టెన్నిస్ కోర్టులో ఉదయం పది గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికైన జట్టు ఫిబ్రవరి 11, 12 తేదీల్లో కడప మున్సిపల్ స్టేడియంలో జరిగే అంతరాష్ట్ర పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

షిర్డీసాయి ఆలయంలో చోరీ



చోరీ జరిగిన ఆలయం

గార: మండలంలోని అంబళ్లవలస షిర్డీసాయి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. ఆలయం ప్రధాన తలుపుల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు సుమారు కేజీ 250 గ్రాముల వెండి వస్తువులను పట్టుకెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా క్లూస్‌టీం పరిశీలించింది. ఏఎస్.ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపరాలను ముంచేస్తున్న మంచు



సిద్ధాంతం ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న మంచు

ఎల్.ఎన్.పేట: మంచుతాకిడి అధికమైంది. రెండు వారాలుగా వేకువజాము నుంచి ఉదయం 8 గంటల వరకు విపరీతంగా మంచు కురుస్తోంది. రాత్రివేళ చలితీవ్రత పెరిగింది. మంచు కారణంగా అపరాల పంటలతో పాటు జీడి, మామిడి పూతకు నష్టం జరుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	54,930-00
బంగారం(22కి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

హిందూ వివాహాల నమోదుకు..
ప్రత్యేక డ్రైవ్

- అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు
- ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సందేహాల నివృత్తి
- రేషన్‌కార్డులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి





జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రేషన్‌కార్డుల స్ప్లిటింగ్, కొత్తకార్డులకు సంబంధించి హిందూ వివాహల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ప్రత్యేక హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఎలాంటి సందేహాలనైనా నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

ఇవీ నిబంధనలు..

- వధువు 18 ఏళ్ల, వరుడు 21 ఏళ్ల వయసు నిండి ఉండాలి. దీనికి ఆధారంగా 10వ తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, జనన ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేయాలి
- వివాహ శుభలేఖలు ఇరువురివీ ఉండాలి.
- వివాహ సమయంలో తాళికట్టిన ఫొటో తప్పనిసరి.
- వధూవరుల్లో ఒకరి చిరునామా స్పష్టంగా తెలియజేయాలి.
- ముగ్గురు సాక్షులు (రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఆధార్‌లతో హాజరుకావాల్సి ఉంటుంది).

యూజర్ ఐడీ సాయంతో..

- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం సమీప సచివాలయం గానీ, మీ-సేవా కేంద్రాలను గానీ సంప్రదించాలి. నేరుగా యూజర్ ఐడీని క్రియేట్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- హిందూ వివాహ రిజిస్ట్రేషన్ అనే పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి. వివరాలు పూరించిన వెంటనే మీకు అనుకూలమైన సమయానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చు.
- ప్రభుత్వం నిర్ణయించిన రూ.200 కాకుండా అదనంగా ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఎక్కడైనా అదనంగా డబ్బులు వసూలు చేస్తే జిల్లా రిజిస్ట్రార్, శ్రీకాకుళం 70939 21335 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

పాడి పరిశ్రమకు పెద్దపీట



సంచార పశువైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

జలుమూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాడి పరిశ్రమకు పెద్ద పీట వేసి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం నరసన్నపేటలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలో భాగంగా జలుమూరు, సారవకోట మండలాలకు కేటాయించిన సంచార పశువైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పశువులు వ్యాధుల బారిన పడినప్పుడు వైద్యశాలలకు తీసుకవెళ్లాలంటే వ్యయప్రయాసాలకు గురయ్యేవారని, ఆ సమస్యలను అధిగమించేందుకు సంచార వైద్యశాలలు ఉపయోగపడతాయన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకునేందుకు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేయాలన్నారు. వెంటనే సిబ్బంది వచ్చి పశువులకు వైద్యం అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, ఏడీ మంధా లోకనాథం, మండల పశు వైద్యాధికారులు పట్ట సంతోష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.శ్యామలరావు, ధర్మాన జగన్ తదితరులు పాల్గొన్నారు.

పలాస ఎస్‌ఈబీ సూపరింటెండెంట్‌కు బదిలీ

కాశీబుగ్గ: పలాస ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేపీ గోపాల్‌కు శ్రీకాకుళం ఎస్‌ఈబీకి శనివారం బదిలీ అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి.

క్యాబేజీకి భలే గిరాకీ



క్యాబేజి పువ్వులను మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్న రైతులు

జి.సిగడాం: మండలంలో క్యాబేజీ పంట విస్తారంగా సాగు చేస్తున్నారు. గెడ్డకంచరాం, జి.సిగడాం, బాతువ తదితర గ్రామాల్లో లభ్యమవుతున్న క్యాబేజీ పువ్వుల ధర మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.30 వరకు పలుకుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జర్జంగిలో పట్టపగలే చోరీ

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి శివాలయం వీధికి చెందిన మునగవలస సావిత్రి ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి పావుతులం బంగారం, 20 గ్రాముల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. సావిత్రి శుక్రవారం తన ఇంటికి తాళం వేసి స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు వెళ్లిన సమయంలో ఈ చోరీ జరిగింది. ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ లక్ష్మణ శనివారం తెలిపారు.

‘బాబుకు అధికారం ఇస్తే పథకాలకు పంగనామం’



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: అబద్ధాలు, మోసపూరిత హామీలతో లాస్ట్ ఛాన్స్ అంటూ జనం ముందుకు వస్తున్న చంద్రబాబు నాయుడుకు అధికారం కట్టబెడితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు పంగనామం పెడతారని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం బైపల్లిలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ పాలన అందిస్తుంటే చంద్రబాబు అండ్ కో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ అమలు చేసిన పథకాలను తన తండ్రి చంద్రబాబు అందించాడని లోకేశ్ ప్రచారం చేయడం విడ్డూరమన్నారు. యువగళం పేరుతో ఎన్ని వేలు కిలోమీటర్లు పాదయాత్ర చేసినా అసెంబ్లీ మెట్లు ఎక్కలేరని స్పష్టం చేశారు. తండ్రి ఇదేం ఖర్మ పేరుతో చేపట్టిన సభలో 11 మందికి బలిదానం చేస్తే ఇప్పుడు కొడుకు చేపడుతున్న పాదయాత్ర ప్రారంభంలోనే బంధువుడిని ఆస్పత్రి పాలు చేసిన ఐరన్ లెగ్ అని ధ్వజమెత్తారు. గతంలో కిడ్నీ వ్యాధి చావులతో చిన్న చూపుగా ఉన్న ఉద్దానం నేడు 200 పడకల రీసెర్చ్ ఆస్పత్రితో తలమానికం కానుందన్నారు. ఆస్పత్రిని ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం పలువురు నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు.

గ్రానైట్ లారీ పట్టివేత

టెక్కలి: టెక్కలి సమీపంలో శనివారం లారీలో అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ బ్లాకులను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. నీలాపురం సమీపంలో కార్తీక్ గ్రానైట్స్‌కు చెందిన రెండు గ్రానైట్ బ్లాకులను లారీలో అక్రమంగా తరలిస్తూ జాతీయ రహదారిపై పార్కింగ్ చేయగా అదే దారిలో వస్తున్న విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. అనంతరం లారీని టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి



సునీల్(ఫైల్)



ఘటనా స్థలంలో మృతదేహం

సరుబుజ్జిలి: కొత్తకోట సమీపంలోని నక్కలపేట చెరువు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రొట్టవలస గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి ధనుకోటి సునీల్(20) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సునీల్ ద్విచక్రవాహనంపై షళంత్రి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా అలికాం-బత్తిలి రహదారిలో శ్రీకాకుళం వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయం తగలడంతో సునీల్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి ధనుకోట దాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సీహెచ్ చంద్రినాయుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

భక్త జన‘సంద్రం’



రథసప్తమి సందర్భంగా అక్కుపల్లి శివసాగర్ బీచ్, నువ్వలరేవు బృందావతి సముద్ర తీరానికి భక్తులు పోటెత్తారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. – వజ్రపుకొత్తూరు రూరల్

గ్రామీణ క్రీడలు ఐకమత్యానికి ప్రతీకలు

- జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి సీదిరి అప్పలరాజు



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: గ్రామీణ క్రీడలు ఐకమత్యానికి ప్రతీకలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం కొండవూరు గ్రామంలో సర్పంచ్ కొల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉన్న గ్రామీణ క్రీడ కబడ్డీ అని, మన జిల్లాలో స్ఫూర్తి కలిగిన కబడ్డీ క్రీడాకారులు ఉండడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మంత్రి అప్పలరాజు కాసేపు కబడ్డీ ఆడి అలరించారు. కాగా, ఈ టోర్నీలో జిల్లా వ్యాప్తంగా 68 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు కొల్లి రమేష్, ఉప సర్పంచ్ లండ ఆనందరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇప్పిలి అప్పన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.వాసు, యూత్ కమిటీ అధ్యక్షుడు దట్టి నాగేష్, బూత్ కమిటీ కన్వీనర్ ఎల్.సూర్యనారాయణ, వై.శ్రీనివాసరావు, కె.సింహాచలం, కె.అప్పారావు, ఎం.తిరుపతిరావు తదితరలు పాల్గొన్నారు.

‘రెవెన్యూ సర్వీసెస్’ భవనాలు ప్రారంభం



నూతన భవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, షాపింగ్ కాంప్లెక్స్ న్యూ ఎనర్జీ మెర్కబా, పిరమిడ్ మెడిటేషన్ సెంటర్, రెవెన్యూ కమ్యూనిటీ భవనాలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు, ఉద్యోగుల సంక్షేమానికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సొంతంగా ఆదాయం సమకూర్చుకుంటే సంఘాలు బలంగా ఉంటాయని చెప్పారు. అనంతరం జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై ఏపీ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఉద్యోగులు సంక్షేమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ బి.శాంతి, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబోలు కృష్ణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, జిల్లా ట్రెజరర్ జి.ఎల్.ఈ. శ్రీనివాసరావు, తహసీల్దార్ వెంకటరావు, సింహాచలం, జె.రామారావు తదితరులు పాల్గొన్నారు

ఊరికి ఉపకారి

- సాగు భూమి అమ్మి దేవాలయం నిర్మాణం
- ఆలయ ప్రతిష్టాపనకు ఏర్పాట్లు



ప్రతిష్టాపనకు సిద్ధమవుతున్న ఆలయం

సారవకోట: మండలంలోని కిడిమి గ్రామానికి చెందిన రొక్కం ఫల్గుణరావు తనకున్న సాగు భూమి రెండు ఎకరాలను అమ్మడంతో పాటు తండ్రి రొక్కం అప్పారావుకు చెందిన 25 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చి గ్రామంలో శివాలయం నిర్మిస్తున్నారు. రూ.40 లక్షలతో శివాలయంతో పాటు నవగ్రహ మండపం, సుబ్రమణ్య స్వామి ఆలయం, అర్చకులు ఉండేందుకు ఇంటి నిర్మాణం చేపట్టారు. స్థానికులు మరో రూ.16 లక్షల వరకు విరాళాలు అందజేయగా ఆలయ నిర్మాణం పూర్తయ్యింది. ఆలయం, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు వచ్చే నెల 3 నుంచి 5 వరకు నిర్వహించనున్నట్లు ఫల్గుణరావు తెలిపారు. గ్రామంలో ఈ ఆలయాలు లేక 5 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేదని, ఈ నేపథ్యంలో ఆలయాలు నిర్మించినట్లు చెప్పారు.

వర్సిటీ విద్యార్థులకు అభినందనలు



బృందాన్ని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఎచ్చెర్ల క్యాంపస్: కర్ణాటకలోని ధార్వాడ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వేదికగా జనవరి 12 నుంచి 16 వరకు 26వ జాతీయ యువజనోత్సవం- 2023 నిర్వహించారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నుంచి జాతీయ సేవాపథకం పీవో తాతారావుతోపాటు వలంటీర్లు జీవిత, పవన్ కల్యాణ్, తేజేశ్వరరావు, అనితా పట్నాయక్ హాజరయ్యారు. ఈ బృందాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ అభినందించారు. ఇటువంటి ఉత్సవాల్లో పాల్గొనటం వల్ల జాతీయ స్థాయిలో భిన్న సంస్కృతులు తెలుస్తాయని, విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం వృద్ధి చెందుతుందని వివరించారు.